www.kalamjyothi.com

# కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

ఆదివారం

20.09.2026




## కార్పొరేట్‌కు ధీటుగా

# సర్కారు విద్య

- పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి
- యూనిఫాంలో ఆకర్షణీయ మార్పులు
- పది శాతం అదనపు చేరికలు
- ఈ నెలాఖరుకు రెండో జత
- వస్తువుల నాణ్యతలో రాజీ పడొద్దు
- చివరి నిమిషంలో కొరత రానివ్వొద్దు
- విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

3లో..



ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపే దిశగా సర్కారు కీలక అడుగులు వేస్తోంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న పాత పద్ధతులకు స్వస్తి పలికి, కార్పొరేట్ బడులకు దీటుగా ఆకర్షణీయమైన రంగులు, సరికొత్త డిజైన్లతో యూనిఫాంలను సిద్ధం చేయాలని నిర్ణయించింది. బడి తెరిచిన రోజే పుస్తకాలు, దుస్తులు పిల్లల చేతుల్లో ఉండేలా ఇప్పటి నుంచే పకడ్బందీ కసరత్తు మొదలుపెట్టింది. ప్రభుత్వ బడులను ప్రైవేటుకు పోటీగా నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి విద్యాశాఖకు దిశానిర్దేశం చేశారు.

## పాఠశాల బస్సులు

# రయ్ రయ్

### అడ్డూ అదుపు లేని వేగం

- విద్యార్థుల భద్రత గాల్లో దీపం!
- రద్దీ రహదారులపై నిత్యం భయాందోళనలు
- చిన్నారుల భద్రతపై ప్రశ్నార్థకం
- తల్లిదండ్రుల్లో తీరని ఆందోళన
- డ్రైవర్ల అర్హతలు, అనుభవ లేమి
- పర్యవేక్షణ కొరవడంతో నిత్యం ప్రమాదాలు..

2లో..

“ గ్రామీణ రహదారులపై ప్రైవేట్ పాఠశాలల బస్సులు మితిమీరిన వేగంతో దూసుకుపోతుండటంతో చిన్నారుల ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లు రద్దీగా ఉంటున్నా పట్టించుకోకుండా డ్రైవర్లు అడ్డూఅదుపు లేకుండా వాహనాలను నడుపుతుండటంతో నిత్యం ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అనుభవం లేని డ్రైవర్లు, ఫిట్‌నెస్ లేని వాహనాలతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ”




## రేవంత్, కేటీఆర్

# క్విడ్ ప్రో కో దోస్త్

- భూదోపిడీపై బీఆర్ఎస్‌తో బేరసారాలు చేస్తున్నారు
- ఆధారాలున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- కేంద్రమంత్రి బండి సంజయ్

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 19) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాణ, ధన, దాన దోస్తులని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఏఐసీసీకి కప్పం కట్టేందుకే భూదోపిడీ అంశంపై బీఆర్ఎస్‌తో రేవంత్ రెడ్డి బేరసారాలు సాగిస్తున్నారని విమర్శించారు. భూదందాలపై స్పష్టమైన ఆధారాలున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులను ఫాంహౌస్‌లకు పంపడం కేవలం రాజకీయ డ్రామా మాత్రమేనని కొట్టిపారేశారు. కేటీఆర్ తన స్నేహితులతో కలిసి క్విడ్‌ప్రోకో వ్యాపారాలు చేస్తున్నారని, అనుమతులు ఇప్పించి లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యమని, మైనార్టీ ఓట్లతో గెలవాలని చూస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 20.09.2026
www.kalamjyothi.com



# పాఠశాల బస్సులు రయ్ రయ్




**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 19) :** చెన్నారావుపేట మండల పరిధిలో నర్సంపేటకు చెందిన పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారులు వాహనాలు, పాదచారులతో తీవ్ర రద్దీగా ఉంటున్నప్పటికీ, బస్సు డ్రైవర్లు ఏమాత్రం వేగాన్ని నియంత్రించకుండా అడ్డూఅదుపు లేకుండా నడుపుతున్నారు. దీంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం పొంచి ఉంటుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.




**చిన్నారుల భద్రతపై ప్రశ్నార్థకం..**

పాఠశాల బస్సుల్లో ప్రయాణించేది చిన్నపిల్లలు అనే కనీస బాధ్యత కూడా లేకుండా కొంతమంది డ్రైవర్లు వ్యవహరిస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మితిమీరిన వేగం కారణంగా చిన్న పొరపాటు జరిగినా పెను ప్రమాదం సంభవించే ముప్పు పొంచి ఉందని, విద్యార్థుల విలువైన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు సురక్షితంగా ఇళ్లకు చేరే వరకు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



**యాజమాన్యాల బాధ్యతారాహిత్యం..**

పాఠశాలల యాజమాన్యాలు అనుభవం, సరైన అర్హతలు లేని డ్రైవర్లను తక్కువ వేతనాలకు నియమించుకుని విద్యార్థుల భద్రతను విస్మరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సరైన అవగాహన కల్పించకపోవడం, వారి ప్రవర్తనను పర్యవేక్షించకపోవడం చిన్నారుల ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. విద్యాసంస్థలు కేవలం ఫీజులపైనే దృష్టి సారిస్తూ ప్రయాణ భద్రతను గాలికొదిలేస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఫిట్‌నెస్ నిబంధనల ఉల్లంఘన..**

నిబంధనల ప్రకారం పాఠశాల బస్సులకు రవాణా శాఖ నిర్దేశించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, స్పీడ్ గవర్నర్లు, అత్యవసర ద్వారాలు, ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి. అయితే మండలంలో తిరుగుతున్న అనేక ప్రైవేట్ వాహనాల్లో స్పీడ్ గవర్నర్లు సక్రమంగా పనిచేయడం లేదని, కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. పాతబడిన వాహనాలను సైతం విద్యార్థుల రవాణాకు ఉపయోగిస్తూ ప్రమాదాలను ఆహ్వానిస్తున్నారు.

**తక్షణ తనిఖీలకు డిమాండ్.**

చెన్నారావుపేట మండలంలోని రహదారులపై తిరిగే ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై సంబంధిత రవాణా, పోలీసు అధికారులు తక్షణమే దృష్టి సారించి ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సులు సమగ్రంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించే స్కూల్ యాజమాన్యాలు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజల ఆరోగ్యమే గ్రామ ప్రగతికి పునాది

## సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్

## తండాలో ఉచిత వైద్య శిబిరం

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 19) :** గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని స్థానికులు కొనియాడారు. చెన్నారావుపేట మండలం బోడ మాణిక్యం తండాలో గ్రామ సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్ కార్యక్రమంలో వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, వారికి వైద్యులు రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రభావం వలన ముందస్తుగా మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తత చర్యల్లో భాగంగా వైద్యులను ఆహ్వానించి గ్రామంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యం – ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి శిబిరం నిర్వహించడం పట్ల గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత వీరన్న నాయక్, వార్డు సభ్యులు బోడ మంగ, నర్సింహా, రాజు, అమ్మి, డాక్టర్ సరోజ, వినోద్, సారియా నాయక్, భద్రయ్య, ఏఎన్ఎమ్ కవిత, ఆశా వర్కర్ జమున, నర్సింహా, హరిలాల్, రవీందర్, యువరాజు, పూలు, శ్రీను, బుచ్చమ్మ, ద్వాలి, సరోజ, కమల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# నిమజ్జనాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



## పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం

## ఎస్పీ పారితోష పంకజ్

**కలంజ్యోతి, సంగారెడ్డి (సెప్టెంబర్ 19) :** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినాయక శోభాయాత్రలు, నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ పారితోష పంకజ్ తెలిపారు. శనివారం నాడు హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్, బోరుపట్ల గ్రామాలలో నిమజ్జన ప్రాంతాలను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పారితోష పంకజ్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలు జరగనున్న చెరువుల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కల్పించవలసిన మౌలిక వసతులు, సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్, జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి, హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపీపీ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొన్యాల సతీష్ పంతులు, మాణిక్ శర్మ, చందు, నరేందర్ గౌడ్, వార్డు సభ్యులు కొన్నాళ్ల శ్రీనివాస్, మల్లేశం, విఘ్నేశ్వరుని భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి పరామర్శ

## ఆపదలో తోడుండటమే నిజమైన మానవత్వం: పులి దేవేందర్

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 19) :** కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలిచి ఓదార్చడమే నిజమైన మానవత్వమని సామాజికవేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి దేవేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కోనెరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల మృతిచెందగా, శనివారం ఆయన చిత్రపటానికి దేవేందర్ ముదిరాజ్ గ్రామస్తులు, బంధువులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యుడు వట్టే రవికిరణ్‌రెడ్డిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా తోడునీడగా ఉండటం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, ఈర్ల రమేష్, కొండ్రెడ్డి రాజు, పెరుమాండ్ల రఘుపతిరెడ్డి, కొండ్రెడ్డి వీరారెడ్డి, అందే ఐలయ్య, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కంకర పోశారు.. రోడ్డు మరిచారు!

## రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలి

## గ్రామస్తుల డిమాండ్



**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 19) :** రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట నుంచి గొల్లపల్లి వరకు గల రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా కంకర పోసి రోజులు గడుస్తున్నా నిర్మాణం ముందుకు సాగకపోవడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై కంకర చెదిరిపోయి గులకరాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖాదర్‌పేట-గొల్లపల్లి రహదారి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



# కార్పొరేట్‌కు ధీటుగా సర్కారు విద్య



కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 19) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రి పంపిణీపై శనివారం ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులందరికీ యూనిఫాం, పుస్తకాలు, ఇతర సామగ్రి అందేలా ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచిన తర్వాత నెలల తరబడి వేచి చూసే పరిస్థితి రాకూడదని, గతం కంటే వేగంగా పంపిణీ పూర్తి కావాలని స్పష్టం చేశారు.

**బడి తెరిచిన నాడే కిట్లు..**

గతంలో స్కూళ్లు తెరిచినా సామగ్రి పంపిణీలో జరిగిన జాప్యాన్ని ఈసారి పునరావృతం కాకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం మొదటి రోజే ప్రతి విద్యార్థి చేతికి బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలు చేరాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే వస్తువుల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం 27.5 లక్షల మంది విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లను అందించే ప్రక్రియ చేపట్టిందని, భవిష్యత్తులోనూ ఎలాంటి ఆటంకాలు రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**సరికొత్త ఆకర్షణీయ మార్పులు..**

ప్రభుత్వ బడుల పిల్లల యూనిఫాంలో సరికొత్త డిజైన్లు, రంగులు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, చూడగానే ఆకర్షణీయంగా ఉండేలా వినూత్న మార్పులు చేయాలన్నారు. కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఈ మార్పులు ఉండాలని పేర్కొన్నారు. ఆధునిక హంగులతో కూడిన నాణ్యమైన వస్త్రాలను మాత్రమే యూనిఫాంల తయారీకి వినియోగించాలని అధికారులకు తేల్చి చెప్పారు.

**పది శాతం అదనపు చేరికలు..**

ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల వల్ల వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని సీఎం అంచనా వేశారు. గతంతో పోలిస్తే సుమారు 10 శాతం అదనంగా విద్యార్థులు చేరవచ్చని, ఆ అదనపు సంఖ్యకు అనుగుణంగా ఇప్పటి నుంచే ఇండెంట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. చివరి నిమిషంలో పుస్తకాలు, దుస్తుల కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించే దిశగా అధికార యంత్రాంగం వేగంగా అడుగులు వేయాలని స్పష్టం చేశారు.

**ఈ నెలాఖరుకు రెండో జత..**

ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఇప్పటికే ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో జత దుస్తులను ఈ నెలాఖరు నాటికి విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. నోట్ పుస్తకాలతో పాటు హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో అవసరమైన సామగ్రిని ఇప్పటికే సరఫరా చేశామని వెల్లడించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పన, పౌష్టికాహారంతో కూడిన భోజనం, స్నాక్స్ అందించడం ద్వారా ప్రభుత్వ బడులను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.



# గురుకులాల్లో విచారణ చేపట్టాలి

## బీఎస్పీ డిమాండ్

**కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 19) :** శ్రీపురంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో విద్యార్థుల భద్రత, వసతులపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. విద్యార్థి భరత్ యాదవ్ ఆత్మహత్య ఘటనకు కారణమైన వారిని గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. బీఎస్పీ నాయకులు గురుకులాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. లెక్చరర్ల వేధింపులు, విద్యార్థులను కొట్టారన్న ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కిటికీలకు తలుపులు లేకపోవడం, బాత్‌రూమ్‌లలో లైట్లు లేకపోవడం, హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడం వంటి సమస్యలను నాయకులు ప్రస్తావించారు. పాము కాటుకు గురైన విద్యార్థి ఘటనపైనా విచారణ జరపాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే లెక్చరర్ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంజేపీ ఆర్సీఓ శ్రీనివాస్‌గౌడ్‌కు బీఎస్పీ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి తక్షణమే కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరారు. సమస్యలపై స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఎస్పీ నాయకులు హెచ్చరించారు.



# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

### బీజేపీ అనుబంధ సంఘాల ప్రకటన

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 19) :** నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గాలను జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ శనివారం ప్రకటించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నిమ్మ పోతన్న, మహిపాల్, నగేష్, సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శులుగా మోహన్ నాయక్, సూరజ్ నాయక్ నియమితులయ్యారు. మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా గుర్దీప్ సింగ్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ నయీం, షేక్ గౌస్, ప్రధాన కార్యదర్శులుగా ప్రతాప్ సింగ్, బి ప్రతాప్ సింగ్, రజాక్ అహ్మద్, రుస్తుం నియమితులయ్యారు. అలాగే ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా అశ్వత్థామ, హనుమా గౌడ్, రవికిరణ్ గౌడ్, లక్ష్మణ్ పటేల్, ప్రవీణ్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా జీవన్, నారాయణ నియామకం పొందారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 20.09.2026
www.kalamjyothi.com





# ఎన్సీపీ కొత్త జోష్

## యువజన సమస్యలపై నిరంతరం పోరాడతాం: రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు




**కలంజ్యోతి, కొత్తగూడెం (సెప్టెంబర్ 19) :** ఎన్డీఏ కూటమి అనుబంధ విభాగమైన నేషనలిస్ట్ యూత్ కాంగ్రెస్ (ఎన్వైసీ) తెలంగాణ శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా యువజన విభాగాన్ని పటిష్టం చేసే దిశగా జాతీయ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు నూతన యూత్ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ ఎన్వైసీ అధ్యక్షుడు ధీరజ్ శర్మ ఆదేశాల మేరకు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నియామక పత్రాల అందజేత కార్యక్రమం ఘనంగా జరిగింది. జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల ఇన్‌చార్జ్ మద్దిశెట్టి సామేలు చేతుల మీదుగా నూతన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. వరంగల్ జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా గాజుల కుమారస్వామి, మహబూబాబాద్ జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా చెవుగాని మహేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ తెలంగాణలో ఎన్వైసీని గ్రామస్థాయి వరకు విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్య, ఉపాధి వంటి సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. నూతనంగా నియమితులైన నాయకులు పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారు రాజులపాటి ఐలయ్య, ఊకే ఎంకన్న, కిన్నెర రామకృష్ణ, పలగాని శ్రీనివాస్ గౌడ్, సూర్య సీతారాములు, కారం చంద్రయ్య, నర్సంపేట ఇన్‌చార్జ్ మోహన్, పోతులూరి చారి, ఇస్త్రాంకుమార్, మామిళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

## మహిళలు స్వామివారి కృపకు పాత్రులు కావాలి: ఉత్సవ కమిటీ

**కలంజ్యోతి, నర్సంపేట (సెప్టెంబర్ 19) :** నర్సంపేట పట్టణంలోని తెలంగాణ కాలనీలో కొలువుదీరిన విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వర స్వామివారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం దాదాపు 40 మంది మహిళలు ఏకతాటిపై కూర్చుని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు ఆచరించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ కాలనీ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఈ పూజలతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమానికి హాజరైన మహిళలకు అన్ని ఏర్పాట్లు చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ ప్రతినిధులు కోరారు.



# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య

**కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 19) :** విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. హత్నూర మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం నాడు ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన అనేక కీలక విషయాలు, విద్యార్థుల హక్కులు, వివిధ న్యాయ చట్టాలు, న్యాయ సందేహాలను కూలంకషంగా వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో, సక్రమంగా చదువుకుని తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి, సిరిపురం గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమల కొండపై ఇల్లంతకుంట

# చిన్నారి నృత్య ప్రదర్శన

## టీటీడీ ఘన సత్కారం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 19) :** ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన మూల భూపాల్ రెడ్డి, మానస దంపతుల కుమార్తె మూల ఆరాధ్య తిరుమల కొండపై తన అద్భుత నృత్య ప్రదర్శనతో భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామివారు సింహవాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతున్న వేళ తిరుపతి సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాకు చెందిన హిమగిరి అకాడమీ తరఫున 23 మంది చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఇందులో ఆరాధ్య తన విశిష్ట నృత్య శైలితో ప్రత్యేక ప్రతిభను చాటుకుంది. తమ కుమార్తె పవిత్ర తిరుమల క్షేత్రంలో నృత్య ప్రదర్శన ఇవ్వడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఆరాధ్య మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను టీటీడీ ఆధ్వర్యంలో సత్కరించి, శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 20.09.2026
www.kalamjyothi.com
Cinima



# విలన్ పాత్రలకూ సై

నటిగా తనను తాను సవాలు చేసుకునే అవకాశం వస్తే ప్రతినాయిక పాత్రల్లో నటించేందుకు కూడా సిద్ధమని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే స్పష్టం చేశారు. మిస్టర్ బచ్చన్ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, ఇటీవల లెనిన్ చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివ కార్తీకేయన్ సరసన సెయాన్ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, సినిమాల ఎంపికలో జానర్ కంటే కథే తన మొదటి ప్రాధాన్యతని తెలిపారు. దర్శకుడికి నమ్మకం ఉంటే పాత్రలో పూర్తిగా లీనమైపోతానని, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారమున్న ఏ పాత్రనైనా చేస్తానని పేర్కొన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధించడంలో తనకున్న మొండితనమే బలాన్నిస్తుందని, ప్రస్తుతం తెలుగు, తమిళ భాషలు నేర్చుకుంటున్నానని చెప్పారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Hamara Warangal Printers and Graphics H.no.258182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.